https://teluguislam.net



# 4- సమాజంలో ప్రసిద్ధి చెందిన నూతన పోకడలు

నేడు మన సమాజంలో అనేక నూతన కల్పితాలు వ్యాపించి ఉన్నాయి. ఎందుకంటే? ప్రజలలో నిజమైన ధర్మజ్ఞానం తగ్గిపోయింది. వారు నూతన పోకడలను అల్లాహ్ ఆదేశాలుగానే భావిస్తున్నారు. అంతేకాక దైవదాస్యం లోను మరియు తమ జీవిన విధానంలోను అవిశ్వాసులను అనుసరిం చేవారు అధికమైపోయారు. ఈ రాబోయే పరిస్థితిని గమనించి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా హెచ్చరించారు:

**"మీ పూర్వికులు తప్పుదోవ పట్టిన విధంగానే మీరు కూడా తప్పుదోవ పడుతారు."** (బుఖారీ, ముస్లిం)

మన సమాజంలో ప్రసిద్ధి చెందిన నూతన కల్పితాలను మూడు విధాలుగా విభజిస్తే వాటిని సులభంగా తెలుసుకోగలుగుతాము.

1) ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినం లేక ఆయన పేరుతో సంభందించిన ఇతర **నూతన ఉత్సవాలు.**

2) ప్రత్యేక స్థలాల్లో, ప్రత్యేక వస్తువుల ద్వారా మరియు పుణ్యాత్ముల సమాధుల వద్ద **శుభాలను (తబర్రుక్)** కాంక్షిస్తూ చేసే ఆరాధనలు.

3) ధర్మ పరంగా ఉన్న ఆరాధనలలో కొన్ని **నూతన కార్యాలను** జోప్పించి చేయడం.

## 1– ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినం లేక ఆయన పేరుతో సంభందించిన ఇతర అధర్మ ఉత్సవాలు.

**రబీఅల్ అవ్వల్ (ఇస్లామీయ క్యాలండరు ప్రకారం మూడవ)** నెలలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క జన్మదిన ఉత్సవం జరపడం పరిపాటయ్యింది.

నిజానికి మీలాదున్ నబీ క్రైస్తవులు జరుపుకునే **'క్రిష్టమస్'** అనే పండుగను పోలి ఉన్నది. అజ్ఞానులైన ముస్లింలు మరియు తప్పుదోవ పట్టిన ముస్లిం పండితులు రబి అల్ అవ్వల్ నెలలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క జన్మదినాన్ని ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నారు. కొంత మంది ముస్లింలు ఈ పండుగను మస్జిద్‌లలో నిర్వహిస్తుంటారు. మరియు కొందరు తమ ఇండ్లల్లో, బహిరంగ ప్రదేశాలలో ప్రత్యేకంగా అలంకరించి మరి జరుపుకుంటారు.

మీలాదున్ నబీ ఇస్లాం ధర్మంలో నూతన కల్పితంగా పుట్టడమే కాకుండా, ఇటువంటి పండుగలలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను మితిమీరి స్తుతించే అనేక కవితాగానాలు, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను సహాయం కోసం అర్థించటం మొదలైన అనేక విధాల బహుదైవా రాధన పద్ధతులు, అసహ్యకరమైన పద్ధతులు కూడా చోటు చేసుకున్నాయి. అయితే ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా ఇలాంటి వాటిని నిషేధించారు:

**عَنْ ابْنِ عَبَّاسٍ سَمِعَ عُمَرَ رَضِيَ اللَّهُ عَنْهُ يَقُولُ عَلَى الْمِنْبَرِ سَمِعْتُ النَّبِيَّ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ يَقُولُ لَا تُطْرُونِي كَمَا أَطْرَتْ النَّصَارَى ابْنَ مَرْيَمَ فَإِنَّمَا أَنَا عَبْدُهُ فَقُولُوا عَبْدُ اللَّهِ وَرَسُولُهُ** (رواه البخاري:**3189**)

**“మీరు నన్ను పొగడటంలో హద్దు మీరకండీ, ఎలాగైతే క్రైస్తవులు మర్యమ్ కుమారుడగు ఈసా (అలైహిస్సలాం) గారి పట్ల హద్దుమీరి పొగడ్తల్లో ముంచారో! నిశ్చయంగా నేను అల్లాహ్ దాసుడను మాత్రమే. కనుక మీరు నన్ను అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అని మాత్రమే అనండి.”**

(బుఖారీ:3189 ).

**మీలాదున్ నబీ** రాత్రి డప్పులతో మరియు ఇతర సూఫీలు వాడే సంగీత వాయిద్యాలతో, చెవుల కింపైన మరియు మృదుమధురమ్మైన పాటలతో కూడిన జన్మదిన పండుగకు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా హాజరవుతారని అపోహ పడుతున్నారు. అంతే కాకుండా ఇటువంటి పండుగలలో స్త్రీ పురుషులు కలిసి ఒకేచోట ఉండటం వలన దుర్బుద్ధి పుట్టి వ్యభిచారానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు. నిజానికి ఇటువంటిదేది జరగక కేవలం ఉత్సాహంగా, ఆనందంగా, ఈ పండుగను జరుపుకున్న కూడా ఇలా చేయటమనేది ఒక నూతన కల్పితమనే విషయాన్ని తెలుసుకోవాలి. ప్రతి నూతన కల్పితం చెడు మార్గం వైపునకు దారి తీస్తుంది. అంతే కాక పైన తెలిపిన చెడు సంప్రదాయాలకు, పాపపు పనులకు ఇది ఒక మార్గవిహీనంగా భావించవచ్చు.

అల్లాహ్ యొక్క అంతిమ సందేశం ఖుర్ఆన్, అల్లాహ్ యొక్క అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం). మరియు ఉత్తమమ్మైన మొదటి మూడు శతాబ్దాలలోని పుణ్యపురుషులు ఆచరణలలో ఎక్కడా కనిపించక పోవటం వలన ఇది బిద్అత్ అయినది. మరియు ఈ **‘మీలాదున్ నబీ’** ఉత్సవం నాలుగవ శతాబ్దంలో ఫాతిమీ సామ్రాజ్య కాలంలో ప్రారంభమ్మైనది.

**మరోక కథనం ప్రకారం: ఏడవ శతాబ్దంలో 'ఖిలాఫతే రాషిదా'** పరిపాలన అస్తమించిన తరువాత **'షామ్'** (సిరియా) దేశానికి చెందిన **'ముజఫ్ఫర్'** అనే ఒక రాజు **'అర్బల్'** అనే పట్టణంలో మొట్టమొదటిగా **'మీలాదున్ నబీ'** పేరుతో ఉత్సవం జరుపుకున్నాడు. మరియు **అబుల్ ఖత్తాబ్ బిన్ దహ్యా 'మౌలూద్'** పేరుతో ఒక పుస్తకాన్ని రచించాడు. దానికి బదులుగా ఆ రాజు ద్వారా అతను **వెయ్యి 'అష్రఫీలు'** బహుమానంగా పొందాడు. **'ముజఫ్ఫర్'** అనే రాజు మహా విందు ఏర్పాటు చేసాడు. దానిలో వెయ్యి మేకలను, పదివేల కోళ్ళను, వంద గుఱ్రాలను, ముప్పై వేల హల్వా ప్లేట్లను సిద్ధం చేసాడు. **'సూఫీయా'** కొరకు కవితా గానాలు మరియు నాట్యాలు చేసే స్త్రీల కచేరీలు ఏర్పాటు చేసాడు. ఆ కచేరీలు జుహర్ సమయం నుండి ఫజర్ సమయం వరకు సాగింది. దానిలో ఆ రాజు కూడా పాల్గొని నాట్యాలు చేసేవాడు. (మస్అలయే మీలాద్ ఇస్లాంకి నజర్ మే ఉర్దూ– పేజి: 55)

**అల్ ఇమాం అబూ హఫ్స్ తాజుద్దీన్ అల్ ఫాకిహానీ** (రహ్మతుల్లాహి అలైహి) ఇలా తెలిపారు: ''తాము కూడా అనుసరించటానికి, కొంత మంది మంచి వ్యక్తులు మాటి మాటికీ నన్ను **'రబి అల్ అవ్వల్'** నెలలో కొంత మంది గుమిగూడి చేసే అల్ మౌలిద్ (ప్రవక్త పుట్టినరోజు) అనే ఉత్సవానికి ఇస్లాం ధర్మంలో ఏదైనా ఆధారమున్నదా, లేదా? అని ప్రశ్నించారు. వారు ఆ ప్రశ్నను ప్రత్యేకమైన పద్ధతిలో తమకు అనుకూలమైన జవాబు రాబట్టాలనే సంకల్పంతో మాటిమాటికీ అడిగేవారు. అప్పుడు నేను కేవలం అల్లాహ్ యొక్క శుభాశీస్సులనే ఆశిస్తూ, వారితో ఇలా పలికాను:

**'దివ్యఖుర్ఆన్ మరియు ప్రవక్త ముహమ్మద్** (సల్లల్లాహు అలైహి వసల్లం) **యొక్క సున్నత్‌లలో మౌలిద్ గురించి నాకు ఎటువంటి ఆధారాలు దొరకలేదు**

**మరియు సరైన ధర్మజ్ఞానం కలిగిన ప్రసిద్ధి పొందిన ఇస్లామీయ పండితులు ఎవ్వరూ ఇలాంటి ఉత్సవాలు, పండుగలు చేయలేదు. కాబట్టి, ఖచ్చితంగా అసత్యపరులు మొదలు పెట్టిన ఒక నూతన కల్పితమిది'.**

**షేఖ్ అల్ ఇస్లాం ఇమామ్ ఇబ్నె తైమియా**(రహ్మతుల్లాహి అలైహి) ఇలా తెలిపారు: ''ప్రజలు క్రైస్తవులను అనుసరిస్తూ లేక ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై తమ మితిమీరిన ప్రేమాభిమానాలను ప్రదర్శించటానికి, ఆయన జన్మదిన తేదీలో ఉన్న బేదాభిప్రాయాలను దాచిపెట్టి మీలాదున్నబీని, ఒక పండుగగా జరపటం అనేది ఒక నూతన కల్పితం. వాస్తవానికి, మన ప్రాచీన పుణ్యపురుషులు దాని ఉనికినే గుర్తించలేదు. ఒకవేళ ఇది ఒక స్వచ్ఛమైన మంచి పని అని వారు భావించి ఉన్నట్లయితే, దీనిని వారు తప్పకుండా చేసేవారు. ఎందుకంటే? పుణ్యాలు సంపాదించటంలో వారు చూపిన ఆసక్తి, ఆతృత, కుతూహలం ఇంకెవ్వరూ చూపలేరు.

వాస్తవానికి వారు (మొదటి మూడు తరాల వారు) తమ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై అధికంగా ప్రేమాభిమానాలు చూపేవారు మరియు పుణ్యకార్యాలు చేయటానికి ప్రాధాన్యత నిచ్చేవారు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అనుసరించటం మరియు విధేయత చూపటం మొదలైన అనుమతించబడిన పనుల ద్వారానే ఆయనపై ప్రేమా భిమానాలు ప్రదర్శించగలం అనే విషయాన్ని వారు గ్రహించారు. వారు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)పై గల తమ ప్రేమాభిమానాలను ఆయన ఆదేశాలను బహిరంగంగా మరియు అంతర్గంతంగా శిరసావహించేవారు. సున్నత్‌లను పున:స్థాపించటానికి ప్రయత్నించేవారు, ఆయన సందేశాన్ని సాధ్యమైనంత వరకు వ్యాపింపజేసేవారు, మనస్ఫూర్తిగా దీని కోసం

అవసరమైతే మాటలతో మరియు చేతులతో పోరాటం చేయటానికి కూడా వెనుకాడేవారు కాదు.

ఆరంభంలో ఇస్లాం స్వీకరించినవారు, మక్కా వదిలి మదీనాకు వలస పోయిన ముహాజిర్లు, మక్కా నుండి వలస వచ్చిన వారికి పూర్తి సహాయ సహకారాలందించిన అన్సారులు, ఇంకా ఎవరైతే ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ను ఖచ్చితంగా అనుసరించేవారో (ధైవవిశ్వాసంలో) వారు పాటించిన పద్దతే సరైన పద్ధతి. వారిని **'సలఫుస్సాలిహీన్'** అంటారు.

ఇటువంటి జన్మదిన వేడుకలు (మీలాదున్నబీ) వంటివీ వారి తర్వాత పుణ్యపురుషులు, ఔలియాల, ఇమాముల జన్నదిన వేడుకలు, ఉరుసులు జరుపుకునే ఆచారంగా మారిపోయింది. ఈ విధంగా **'ఇలల్ బిదాఅ'** (నూతన కల్పితాల)ను ఖండిస్తూ, అనేక వ్యాసాలు వ్రాయబడినవి. ఇలా ఇస్లాం ధర్మంలో ఒక పెద్ద దురాచారానికి మార్గం ఏర్పడినది.

## 2- ప్రత్యేక స్థలాల్లో, ప్రత్యేక వస్తువుల ద్వారా మరియు పుణ్యాత్ముల సమాధుల వద్ద శుభాలను (తబర్రుక్) కాంక్షిస్తూ చేసే ఆరాధనలు.

**అత్ తబర్రుక్ అంటే;** శుభాలను ఆశించడం. మేళ్ళు, శుభాలు కలగడం మరియు శుభాలు ప్రాప్తించడం.

ఎవరికైతే మేళ్ళను మరియు శుభాలను ప్రాసాదించే అధికారం ఉందో, వారితోనే కోరడం సమంజసం. శుభాలను ప్రసాదించే అధికారం ఎవరికైతే లేదో, వారి ద్వారా శుభాలు ఆశించడం లేక కోరడం అవివేకం. కనుక మేళ్ళను మరియు శుభాలను ప్రసాదించగలిగే అధికారం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. సర్వసృష్టిలో ఉన్న ఏ వ్యక్తికి మేళ్ళను మరియు శుభాలను ప్రసాదించే శక్తిగాని, ఆధికారంగాని లేదు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు: **''ఆయనే అల్లాహ్ మీ ప్రభువు, విశ్వసామ్రాజ్యాధికారం ఆయనదే! మరియు ఆయనను వదిలి మీరు వేడుకొనే వారు, ఖర్జూర బీజంపై నున్న పొరకు కూడా యజమానులు కారు- మీరు వారిని వేడుకున్నప్పటికీ, వారు మీ ప్రార్థనలను వినలేరు, ఒక వేళ విన్నా, వారు మీకు జవాబివ్వలేరు''** (సూరతుల్ ఫాతిర్:13-14).

మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఓ అల్లాహ్ నీవు ఎవరికైన ప్రసాదిస్తే దానిని నివారించేవారు ఎవరూ లేరు. నీకృపే లేకపోతే కృషి చేయువాని కృషికి ప్రతి ఫలము ఏమియు లేదు.''

(బుఖారీ:799, ముస్లిం:725)

ప్రత్యేక స్థలాల్లో మరియు బ్రతికున్న లేక మరణించిన పుణ్యప్రజల యందు శుభాలను ఆశించడం ధర్మసమ్మతం కాదు. ఒకవేళ వారిద్వారా శుభాలు ప్రాప్తిస్తాయని విశ్వసిస్తే అది షిర్క్ అవుతుంది. మరియు కొన్ని వస్తువులను పవిత్రంగా భావించి వాటి తాకిడి వల్ల శుభాలు ప్రాప్తిస్తాయని, ప్రత్యేకమైన స్థలాలలో బస చేయడం వల్ల శుభాలు ప్రాప్తిస్తాయని నమ్మడం షిర్క్ వైపుకే దారి తీస్తోంది. 🗀

---

🗀 ముఖ్య గమనిక: ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) బ్రతికుండగా ఆయన శిరోజాలను, ఆయన చమటను, మరియు ఆయన దుస్తులను శుభాలుగా భావించి సహాబాలు వాటితో ప్రయోజనం పొందేవారు. ఆ విధంగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వ్యక్తిత్వంతో మాత్రమే శుభాలను ఆశించడం ధర్మం. మరియు ఆయన శరీరానికి సంబంధించిన ఏ ఒక్క వస్తువు (వెంట్రుకలు, తలపాగ, దుస్తులు, ఉంగరం వంటివి) మనకు లభించిన వాటిని పవిత్రంగా భావించి శుభాలను ఆశించడం కూడా ధర్మమే. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చనిపోయిన తరువాత ఆయనకు సంబంధించిన వస్తువులు ప్రస్తుత కాలంలో లేవు, కాబట్టి ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం)వ్యక్తిత్వం ద్వారా మరియు వారి వస్తువుల ద్వారా శుభాలను ఆశించడం అనేది కూడా లేదు. ఒక వేళ పవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం)గారికి సంభందించిన వస్తువు ప్రామాణికమైన ఆధారాలతో లభించినట్లయితే శుభంగా ఉపయోగించడం ధర్మం.

కాని ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంటిని లేక సమాధిని మరియు ఆయన నమాజు చేసే చోటును లేక ఆయన కూర్చునే చోటును శుభాల కొరకు ప్రత్యేకించలేదు. అలాగే హిరా కొండను, సౌర్ కొండను, జబలుర్ రహ్మా (అరాఫాత్ మైదానంలో నిలబిడి ప్రసంగించిన) కొండను శుభాలుగా ఆశించి ఎక్కడం లేక బస చేయడం మరియు అక్కడ నమాజు కొరకు ప్రధాన్యత ఇవ్వడం కూడా ధర్మం కాదు. ప్రపంచంలో మక్కా మరియు మదీనా పవిత్రమైన స్థలాలు. అక్కడ ఉన్న కాబతుల్లాహ్ మసీదు, మరియు మదీనాలో ఉన్న మస్జిద్ నబవీ మరింత పవిత్రమైనవి. అలాగే మజ్జిదే అఖ్సా కూడా పవిత్రమైనది. మరియు మక్కా మసీదులో ఉన్న జమ్‌జమ్ నీరు అతి పవిత్రమైనది. మదీనా లో పండే 'అజ్వా' ఖర్జూరాలు శుభమైనవి.

https://teluguislam.net



హజ్రత్ అబూబకర్ మరియు హజ్రత్ ఉమర్, హజ్రత్ ఉస్మాన్, హజ్రత్ అలీ, హజ్రత్ హసన్, హుసైన్ వంటి ఉత్తమమైన సహాబాలు, మరియు వారిలో కొందరు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కుటుంబానికి చెందినవారు కూడా ఉన్నారు. అంతేకాక వారందరితో అల్లాహ్ ప్రసన్నుడయ్యాడు మరియు వారు కూడా అల్లాహ్‌తో సంతుష్టులయ్యారు అనే విషయం దైవగ్రంథం ఖుర్ఆన్ ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. అలాంటి మహా పుణ్యాత్ములైన సహాబాలను, వారు ఉపయోగించిన వస్తువులను ఆ నాటి ప్రజలు శుభాల కొరకు ప్రత్యేకించలేదంటే, వారి తరువాత తరాల ప్రజల నుండి శుభాలను ఆశించడం ఎంతవరకు ధర్మం?

ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారి తరానికి చెందినవారు సహాబాలు మరియు సహబాల తరానికి చెందినవారు తాబయీన్‌లు, తబా తాబయీన్‌లు. వారందరూ పవిత్రమైన తరాలకు మరియు కుటుంబాలకు చెందినవారు. కనుక ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

**قَالَ النَّبِيُّ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ: "خَيْرُكُمْ قَرْنِي ثُمَّ الَّذِينَ يَلُونَهُمْ ثُمَّ الَّذِينَ يَلُونَهُمْ ".**

(رواه البخاري: **2457**– مسلم: **4603**)

**“ప్రజలందరిలోకెల్లా నా తరం ప్రజలు ఉత్తములు (పుణ్యాత్ములు) మరియు ఆ తరువాతి తరంవారు, మరియు ఆ తరువాతి తరంవారు”** ........(బుఖారీ:2457, ముస్లిం:4603)

అంటే; వారందరు పుణ్యాత్ములనీ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ధృవీకరించారు. అయినా వారినుండి, వారి సమాధుల నుండి మనం ఎలాంటి శుభాలను ఆశించడం లేదు మరియు ఆశించకూడదు.

వారి తరువాత జ్ఞానవంతులైన ఇమాములు, హదీసు జ్ఞానం కలిగిన ముహద్దిసీన్లు, ధర్మాన్ని తూచతప్పకుండా అనుసరించే ఔలియాలు (పుణ్యాత్ములు) మరియు సాధారణ ముస్లింలు ప్రళయం వరకూ సమాజంలో ఉంటారు. వారిలో మనం కొందరినీ ఔలియాలనీ నిర్ణయించుకొని వారిద్వారా శుభాలను ఆశించడం మరియు వారు తినిత్రాగి వదలిన వస్తువులను, వారు ధరించే వస్త్రాలను, లేక వారికి సంబంధించిన ఇతర వస్తువులను శుభాలుగా భావించటం ఎంతవరకు సమంజసం? మరియు వారు మరణిస్తే వారి సమాధులను దర్గాలుగా నిర్మించి ప్రత్యేకంగా దర్శించటం, వాటి ద్వారా శుభాలను ఆశించటం మరియు అక్కడ భయంభక్తిని చూపటం ఎంతవరకు ధర్మసమ్మతం? అందుకనే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ఇలా హెచ్చరించారు:

**عَنْ عَائِشَةَ رَضِيَ اللهُ عَنْها قَالَتْ قَالَ رَسُولُ اللَّهِ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ : "مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا مَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ."** (رواه البخاري:**2499**– مسلم:**3242**).

''ఎవరైనా మేము ఆదేశించని పని ఏదైనా చేస్తే అది త్రోసిపుచ్చదగినది''

(బుఖారీ:2499, ముస్లిం:3242).

## 3– ధర్మ పరంగా ఉన్న ఆరాధనలలో కొన్ని నూతన కార్యాలను జొప్పించి ఆరాధించడం:

ప్రస్తుత కాలంలో ప్రతి ఆరాధన విధానంలో అనేక నూతన కల్పితాలు వ్యాపించబడ్డాయి. వాస్తవానికి ఆరాధనలకు మూల సూత్రం **'తౌఖీఫీ' (ఎలాంటి హెచ్చుతగ్గులు చేయకుండా ఇస్లాం ఆదేశాల మేరకు కట్టుబడి ఉండటం)** కనుక మనం చేసే ఆరాధనలకు ఖుర్ఆన్ మరియు నిజమైన హదీసుల సాక్ష్యాధారాలు లేవంటే అది ఎన్నటికీ ధర్మం సమ్మతం కాదు. సరైన సాక్ష్యాధారాలు లేకుండా ఏ కార్యమూ ధర్మంలో చట్టబద్ధం కానేకాదు. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ఇలా తెలియజేసారు:

**مَنْ أَحْدَثَ فِي أَمْرِنَا مَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ** (رواه البخاري:**2499**– مسلم:**3242**)

**''ఎవరైనా మేము ఆదేశించని పని ఏదైనా చేస్తే అది త్రోసిపుచ్చదగినది.''**

(బుఖారీ:2499, ముస్లిం:3242).

**1– వుజూ మరియు నమాజ్** విధానాలలో, రమజాన్ ఉపవాసాల మరియు హజ్ ఆచరణలలో అనేకమైన బిద్అత్ కార్యాలను ప్రజలు కల్పించుకు న్నారు. వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి:

1– **వుజూ; వుజూ** చేయుటకు ముందు **'బిస్మిల్లాహ్'** అని, తరువాత క్రమంగా వుజూ చేసి, వుజూ చివరిగా ఒక దుఆ పఠించాలి.

కాని కొంత మంది ప్రజలు వుజూ మధ్యలో కొన్ని దుఆలు చదువుతుం టారు మరియు మెడ మసా, చేతుల మసా చేస్తారు. అలాగే వుజూ చివరిలో చేతి ప్రేళ్ళను ముద్దుపెట్టుకొని కళ్ళకు అద్దుకునే **బిద్అత్** ఆచారాలు పాటిస్తుంటారు.

**2- నమాజు కొరకై సంకల్పం** అనేది మనస్సులో వెలువడేది. అది హృదయంలో జరిగే ఒక కార్యం. దానిని నియ్యత్ అంటారు. కనుక అది నాలుకతో చెప్పే కొన్ని పదాలు కావు. మరియు **(నేను...ఇన్ని రకాతుల...ఈ వేళ సున్నత్ లేక ఫర్జ్ నమాజు అల్లాహ్ కొరకు కాబా గృహం వైపునకు ముఖము చేసి నమాజు చేస్తున్నాను),** అనే పదాలను ఏ భాషలో పఠించిన, వాటికి ఏ ఒక్క నిజమైన హదీసు ఆధారం లేదు. కనుక ఇది ఒక **బిద్అత్** కార్యంగా భావించబడింది.

**3- నమాజు తరువాత సున్నత్** గా పఠించవలసిన దుఆలును చదవడం సాంప్రదాయం. మరియు ప్రతి ఒక్కరు స్వయంగా తమతమ దుఆలు చేసుకోవాలి.

కాని నమాజు తరువాత మస్నూన్ దుఆలు చదవక ముందు నుదిటిపై హస్తాన్ని వుంచి **'యా ఖయ్యూమ్'** అంటు మూడు సార్లు చదివి మరియు మూడు సార్లు **'యా నూర్'** అని చేతి వ్రేళ్లపై ఊది కళ్ళకు అద్దుకునే ఆచారాన్ని పాటిస్తారు. నమాజు తరువాత సామూహికమైన దుఆను చేస్తారు. మరియు కొంత మంది ప్రజలు **ఇఖామత్ పలుకులు చెప్పక ముందు దురూద్ దుఆ** చదివి తరువాత ఇఖామత్ పాదాలు పలుకుతారు. మరియు నమాజ్ తరువాత లేచి నిలబడి **'దరూద్ వ సలామ్'** అంటూ, ఖిబ్లావైపు అభిముఖం చేసి కొన్ని పదాలు సామూహికంగా చదువుతారు. ఇలాంటి కార్యాలన్నీ ఎంత మాత్రం సున్నత్ సంప్రదాయం కాదు.

**4- శుక్రవారం రోజు జుమా నమాజు** కొరకు స్నానం చేసి, పరిశుభ్రమైన దుస్తులు ధరించి, సువాసన రాసుకొని, నమాజు కొరకు తొలివేళలో మసీదుకు వెళ్ళి కనీసం రెండు రకాతులు నఫిల్ నమాజు చదివి,

నిశబ్దముగా ఇమామ్ గారి ప్రసంగం వినడం ఎంతో పుణ్యమైన కార్యం. అలాగే ఆ రోజు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) కొరకు 'దరూద్ దుఆ'చదవటం, దాన ధర్మాలు చెయ్యడం కూడా పుణ్యకరమైన ఆచారాలు.

కాని శుక్రవారం మసీదులో నమాజుకు ముందు రెండు **ప్రసంగాలు చెయ్యడం,** నఫిల్ నమాజ్ కొరకై ప్రత్యేకంగా ఆ రెండు ప్రసంగాల **మధ్య సమయాన్ని కేటాయించడం,** జుమా నమాజ్ చదివిన తరువాత ఇహ్తియాతే జుహర్ అంటూ జుహర్ నమాజ్ నాలుగు రకాతులు చదవడం, ఆ రోజు సాయంత్రం ఫాతిహాలు చెయ్యడం, మరియు ప్రత్యేకంగా ఆరోజు శ్మశానాన్ని సందర్శించడం బిదఅత్ ఆచారాలుగా భావించబడతాయి.

5–రమదాన్ నెలవంక చూసి ఉపవాసాలు పాటించాలి, నెలవంక చూసి ఉపవాసాలు విరమించాలి. మరియు తరావీహ్ నమాజ్ మసీద్‌లో సామూహికంగా నెరవేర్చడం ధర్మం. లేక తమ తమ నివాసాలలో విడివిడిగా కూడా నెరవేర్చడం ధర్మమే.

కాని రమదాన్ నెలవంక చూడక ఒక రోజు మునుపే ఇస్తెక్బాలే రమదాన్ అంటూ ఉపవాసం ఉండటం మరియు ఉపవాసం నియ్యత్ అంటూ **'నవైతు సౌమ గదిన్ అన్ అదాఅ ఫర్జి రమదాన హాజిహిస్సనతి లిల్లాహి తఆలా'** అని పఠించే పదాలు, తరావీహ్ నమాజ్ రెండు రకాతుల మరియు నాలుగు రకాతుల విరామం సమయంలో కొన్ని ప్రత్యేకమైన తస్బీహ్ పదాలను పఠించడం, తరావీహ్ నమాజులో ఖుర్ఆన్ చాలా తొందరపాటుగా చదవటం, రమదాన్ చివరి దశకంలో మసీదులను

https://teluguislam.net



అలంకరించడం మరియు రమదాన్ 27వ రాత్రి శ్మశానానికి పోయి ఫాతిహాలు చేయడం వంటి కార్యాలు బిద్అత్‌గా పేర్కొనబడ్డాయి.

**2- ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధానం ప్రకారం హజ్ విధానాలను పాటించడం ధర్మం.**

1- కొంత మంది ప్రజలు హజ్ సంకల్పం చేసికున్న తరువాత ప్రయాణానికి ముందు పూలహారాలు వేసుకొని ఊరేగించి, పెద్ద పెద్ద పార్టీల ఏర్పాట్లు చేసి, ఆ తరువాత తమ పెద్దల కాళ్ళపై పడి మ్రొక్కి, ఔలియాల సమాధులను దర్శించి, ఫాతిహాలు చేసి తరువాత ప్రయాణించడం శుభంగా భావిస్తారు. మరియు కొంత మంది ప్రజలు హజ్జ్ నెరవేర్చక ముందు ఇరాఖ్‌లో ఉన్న దర్గాలను సందర్శించే హజ్ విధిని నెరవేర్చుతారు. అలా చేయడం ధర్మ పరమైన సాంప్రదాయం కానే కాదు.

2- కాబతుల్లాహ్ ప్రదక్షణలు చేయడం మరియు **'హజ్రే అస్వద్'**ను ముద్దాడటం, మరియు రుక్నెయమానీని తాకడం, మరియు కాబతుల్లాహ్ తలుపు **(బాబే ఇస్తేలాం)** వద్ద నిలబడి దాన్ని పట్టుకుని దుఆలు చేయడం వంటి ఆచారాలు ధర్మపరమైనవి, ఆమోదయోగ్యమైనవి.

కాని కాబతుల్లాహ్ గోడలను భక్తితో తాకడం, తమ ముఖాలతో మరియు చేతులతో గోడలను రుద్దుకోవడం, ప్రదక్షణల కోసం ప్రత్యేకంగా స్నానం చేయడం, ముఖామే ఇబ్రాహీం వద్ద ఉన్న జాలికను తబర్రుక్‌గా భావించి తాకడం, అక్కడ నిలబడి దుఆలు చేయడం వంటి ఆచారాలు సాంప్రదాయం కానే కావు.

3- మక్కాలో మినా ప్రదేశంలో ఉన్న జమ్రాతులను (చిహ్నాలుగా ఉన్న మూడు షైతాన్ స్థంబాలు) **చిన్నచిన్న కంకర రాళ్ళతో విసరి కొట్టడం ధర్మం.**

కాని కొంత మంది అమాయక ప్రజలు ఆ రాళ్ళను నీటితో కడిగి తరువాత షైతాన్ స్థంబాలుపై విసరడం జరుగుతుంది. లేక కోపంతో చెప్పులతో, ఇతర వస్తువులతో విసరికొట్టడం జరుగుతుంది అక్కడ అలా చేయడం ధర్మం కాదు.

4- బక్రీద్ పండుగ రోజు ఖుర్బాని చెయ్యడము మరియు హజ్ చేసేవారు ఖుర్బాని చేయడము ధర్మం.

కాని ఖుర్బాని చేయుటకు జంతువును జబహ్ చెయ్యకుండా, ఆ జంతువు విలువకు సమానమైన డబ్బును దానంగా చెల్లించడం, లేక హజ్ విధిని నెరవేర్చకుండా, దానికి బదులుగా ఆ డబ్బులను దానం చేయడము ధర్మం కానే కాదు.

5- హజ్ చేసేవారు శిరోముండనం చేసుకోవడం, లేక పూర్తిగా తల వెంట్రుకలు కత్తిరించడం సున్నత్ సాంప్రదాయం.

కాని కొంత మంది ఉమ్రా లేక హజ్ చేసేవారు సగం తల గొరగించు కుంటారు, లేక తల వెంట్రుకల నుండి అక్కడక్కడ కొన్ని వెంట్రుకలు మాత్రం కత్తిరిస్తారు. ఇలా చేయడం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సాంప్రదాయం కాదు.

6- మదీనాకు పోయినప్పుడు వుజూ లేకుంటే, వుజూ చేసుకొని మొట్టమొదట మస్జిద్ నబవీలో నమాజు చేయడం సున్నత్ సాంప్రదాయం. తరువాత ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సమాధి వద్దకు పోయి పద్ధతి ప్రకారం సలామ్ చెప్పి, మరియు దరూద్ దుఆ పఠిచడం ధర్మపరమైన ఆచారం.

కాని కొంత మంది ప్రజలు మదీనాలో ప్రవేశించక ముందు స్నానం చేసుకొని తరువాత ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సమాధిని దర్శనం చేసి, ఆ తరువాత మస్జిద్ నబవీలో నమాజు నెరవేర్చుతారు. ఆ సమాధి చుట్టూ ఉన్న జాలికను పట్టుకొని ఏడవటం, రకరకాల ప్రమాణాలు, వాగ్దానాలు చేయటం, ఆ జాలికను పట్టుకొని శుభాలను ఆశించటం, ఆ సమాధి చుట్టూ తిరుగుతూ ఖుర్ఆన్ పారాయణం మరియు నఫిల్ నమాజులు చేయటం, అక్కడ భయభక్తితో నిలబడి మొరపెట్టుకోవటం ధర్మంగా భావిస్తారు. మరియు కొంత మంది ముస్లింలు తమ వైపు నుండి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సమాధి వద్దకు పోతే **దురూద్** మరియు **సలామ్** చెల్లించవలసిందిగా కోరుతారు. మరియు అక్కడకు చేరుకున్నవారు వారి తరఫున **దరూద్** మరియు **సలామ్** ఆ సమాధికి తెలుపుతారు, మరియు అలా చెయ్యడం పుణ్యపరంగా భావిస్తారు. కాని అటువంటి ఏ కార్యానికి ఇస్లామీయ ధర్మంలో అనుమతి లేనే లేదు.

ఇస్లామీయ మిత్రులారా! **నూతన కల్పిత (బిద్అత్‌లు) ఆచారాలు పాటిస్తూ, పుణ్యాన్ని ఆశించడం మహా అవివేకంతో కూడుకున్నది.** ఎందుకంటే? అలాంటి ఆచారాలు అల్లాహ్ మరియు అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్ద ఘోరమైన పాపాలు. అందుకనే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేసారు:

**فَإِنَّهُمْ يَأْتُونَ يَوْمَ الْقِيَامَةِ غُرًّا مُحَجَّلِينَ مِنْ أَثَرِ الْوُضُوءِ قَالَ أَنَا فَرَطُكُمْ عَلَى الْحَوْضِ ثُمَّ قَالَ لَيُذَادَنَّ رِجَالٌ عَنْ حَوْضِي كَمَا يُذَادُ الْبَعِيرُ الضَّالُّ فَأُنَادِيهِمْ أَلَا هَلُمُّوا فَيُقَالُ إِنَّهُمْ قَدْ بَدَّلُوا بَعْدَكَ وَلَمْ يَزَالُوا يَرْجِعُونَ عَلَى أَعْقَابِهِمْ فَأَقُولُ أَلَا سُحْقًا سُحْقًا (صحيح إبن ماجة: 4306)**

https://teluguislam.net



''ప్రళయ దినాన నా అనుచర సమాజానికి చెందినవారు, వుజూ కారణంగా వారి కాళ్ళు చేతులు ప్రకాశిస్తూ ఉంటాయి, అప్పుడు నేను అందరికంటే ముందు 'హౌజు కౌసర్' వద్ద ఉంటాను.

జాగ్రత్తా! నా 'హౌజు కౌసర్' నుండి కొంత మంది ప్రజలను దూరంగా నెట్టి వేయటం జరుగుతుంది, ఎలాగైతే దారి తప్పిపోయి వచ్చిన ఒక ఒంటెను నెట్టివేయడం జరుగుతుందో అలాగే.

తరువాత నేను వారిని కేకపెట్టి స్వాగతం సుస్వాగతం అని పిలుస్తాను. అప్పుడు అల్లాహ్ దూతలు: ''మీ తదనాంతరం వీరంతా (ధర్మంలో) అనేక మార్పులు చేసుకున్నారు' అని అంటారు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): 'దూరంగా తరిమేయండీ, తరిమేయండీ'' అని అంటారు.

(సహీహ్ ఇబ్ను మాజా::4306)

నూతన ఆచారాల వలన షైతాన్ సంతోషపడతాడు. ఎందుకంటే? ఒక వ్యక్తి ఇతర పాపాలు చేస్తే అతను చేసేది పాపం అని తెలిసి, ఏదో ఒకరోజు ఆ పాపకార్యం నుండి పశ్చాతాప పడి అల్లాహ్‌తో క్షమాబిక్ష అడగటానికి అవకాశం ఉంటుంది. కాని బిద్అత్ కార్యాలలో కూరుకుపోయినవారు తాము చేస్తున్న అధర్మమైన ఆచారాలన్నీ, అల్లాహ్‌కు చేరువయ్యే ఒక విధమైన ఆరాధనలుగానే నమ్మటం జరుగుతుంది. దానివలన వారు తాము చేస్తున్నది తప్పని తెలుసుకోలేక పశ్చాతాప పడటానికి అవకాశం కూడా ఉండదు. మరియు ధర్మ పరంగా లేని ఆచారాలను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సంప్రదాయాలుగానే భావించి, క్రొత్త క్రొత్త కల్పిత ఆరాధనలను సమాజంలో వ్యాప్తి చేయుటకు కారకులవుతారు. అలా వారు మార్గభ్రష్టత్వానికి గురిఅవుతారు, ఇతరులను కూడా మార్గభ్రష్టత్వానికి గురిచేస్తారు.